మనసుకే కళ్ళుంటే!

డా॥ కె. వి. కృష్ణకుమారి

"వింటున్నావా?-"

"ఊం....—"

"నిజంగా—"

"అబ్బ చెప్పరా —"

శేఖరు మొహం కన్పించక పోయినా – మాటల్లో విసుగు కన్పిస్తుంటే చిన్నబుచ్చుకున్నాడు రామకృష్ణ.

"......... ....."

"సారీ... సోసారీ... ఇవాళ పనెక్కువగా వుందని చెప్పానుకదూ-అందుకే-కాస్త విసుగ్గా వుందంతే.."

ఆ విసుగు నీ మీద లేనన్నట్టు భుజం తట్టాడు శేఖర్.

శేఖర్, రామకృష్ణా, ఇద్దరూ ఒకే ఊళ్ళో చిన్న తనంలోనే కల్సిమెల్సి చదువుకున్న వాళ్ళు. మెరిట్ స్టూడెంట్సుగా కాలేజ్ ఒకేసారి వొదిలి పెట్టారు. ఒకరంటే ఒకరికి విపరీతమైన అభిమానం-ఆపేక్షావున్నాయి. దాపరికమంటే ఏమిటో మొదట్నుంచీ ఇద్దరికీ తెల్సేదికాదు-

ఎన్నో ఏళ్ళ తరువాత—విసిరేసినట్టు ఎక్కడికో వెళ్ళిపోయిన ఇద్దరూ ఒకే హోదాలో-ఒకే ఉన్నత స్థాయిలో ఒకే ప్రభుత్వ సంస్థలో-ఒకరి నొకరు కేవలం కొలీగ్స్‌గా పరిచయం చెయ్యబడ్డ—'ఇద్దరూ' మాటలు మర్చిపోయి కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయారు.

మాటలు కరువయాయి.

మనసులు మూగపోయాయి.

ఆత్మీయతతో తిరిగి దగ్గరయాయి.

శేఖర్‌కి మొదట్నుంచీ ఎటువంటి బరువు బాధ్యతలూ లేవు వడ్డించిన విస్తరి లాంటి జీవితం, అన్నిటి లాగానే భార్య లక్ష్మి వెతుక్కుంటూ వచ్చేసింది దాంపత్య జీవితంలోకూడా అసంతృప్తి అంటే ఏమిటో తెలియని స్థితిలోనే ఇన్నేళ్ళూ గడచిపోయాయి. పెద్దవాడు ఇంజనీరింగ్‌లో చేరాడు. పాప మెడిసన్‌లో చేరే ఉద్దేశ్యంతో ఎంట్రెన్స్‌తో కుస్తీపడుతోంది. ఎటు చూసినా లక్ష్మి, అదృష్టం, ఆనందం, తృప్తీ తాండవిస్తున్నాయింట్లో రామకృష్ణ మొదటి సారిగా శేఖర్ ఇంటికి వెళ్ళి-తన జీవితంలో లోపించిన దేమిటో ఆసలు జీవితానికి కావల్సిందేమిటో మొదటిసారిగా తెల్సుకున్నాడు.

అంతవరకూ పెళ్ళన్నా సంసారమన్నా అంతకుత్సాహం చూపించని రామకృష్ణ మొదటి సారిగా అనుకున్నాడు-

"ఇటువంటి స్వీట్ హోం వుండటం అదృష్టం!"

"దేనికీలోటు లేదనుకుంటున్న తన జీవితం ఎంత నిస్సారమైనది—"

రామకృష్ణ బాధ్యతల్నీ, పెద్ద కొడుకుగా తను మిగుల్చుకున్న ఒక్కొక్క బంధాన్నీ మరో బంధానికి ముడి పెడుతూ—తనకంటూ ఇంకేం సమస్యలు మిగల లేదనీ,

మిగుల్చుకోలేదనీ తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాక–అప్పటిదాకా ఏమీ మాట్లాడలేక పోయిన తల్లిదండ్రులు మొదటి సారిగా అన్నారు. బాధ్యతా యుతంగా అన్నారు.

"రామూ–చెల్లెళ్ళకీ–తమ్ముళ్ళకీ దోవలు చూపించావు. కన్నతండ్రికన్నా ఎక్కువగా నీ బాధ్యతలు నువ్వు నెరవేర్చుకున్నావు............"

"........................."

"సంతోషం నాయనా–నీలాంటివాణ్ని

కన్నందుకు మేము గర్వపడుతున్నాం — ఐతే-నిన్ను చూసి గర్వపడగల నీ పిల్లలకి తండ్రిగా నిన్ను చూడాలని వుందిరా—"

తేలిగ్గా నవ్వేశాడు రామకృష్ణ.

"అలా నవ్వేయకు. నీకేం వయసు మించిపోలేదు. నీకున్న అర్హతలకీ, ఇప్పటి నీ స్థితిక్కి-పెళ్ళికూతుళ్ళు క్యూలోనిలబడి మరీ వస్తారు....ఇన్నాళ్ళూ - అనలేక పోయాం....—నీ పట్టుదల చూసి-ఇప్పుడింక-నీ మీద భారంగా ఎవ్వరూ మిగిలిలేరు.... మేంతప్ప—"

బాధగా చూశాడు రామకృష్ణ.

"నువ్వు భారం అనుకోవు.... తెల్సు.... మా ముచ్చటా——"

మళ్ళా బంధాలవెంట బాధ్యతల్లోకి దిగాలిక. అంత ఓపికుందా తనకిప్పుడు.?-

ఇప్పుడు పెళ్ళయితే-ఆ తరువాత పిల్లలు పుట్టి....వాళ్ళు పెరిగి .... మళ్ళా బాధ్యతలు....ఇంతేగా మళ్ళా—"

తలలో మెరుస్తున్న వెండివెంట్రుకల్ని చూస్తున్నప్పుడల్లా భారంగా అనుకునేవాడు.

ఐనా ఇప్పుడు తనకేం తక్కువైంది?. క్లాస్‌వన్ ఆఫీసర్. బాదరబందీలేని జీవితం. "ఈ రిటైర్డ్ లైఫ్ ఎంత హాయిగా వుంది—"

శేఖర్ నవ్వాడు.

"ఎంత హాయిగా వుందో మా ఇంటికొచ్చి నిర్ణయించుకు చెప్పు. ఓ. కె."

శేఖర్‌కి సమాధానం రామకృష్ణ కళ్ళల్లోనే కన్పించింది.

రామకృష్ణ ఓ. కె. చెయ్యడానికి తగినన్ని కారణాలు కన్పించాయి.

శేఖర్ రాకకోసం ఎదురు చూస్తూ శూన్యంలోకూడా తను కోరుకునే ఆ ప్రతి కోసం ఎదురుచూసే లక్ష్మి కళ్ళల్లో ఎంత మెరుపు?

శేఖర్‌ని చూడగానే.

కారు హార్న్ విన్పించగానే-అమాయకంగా ఆత్మీయంగా తండ్రిని చుట్టుకుపోయే ఆ పసిపిల్లల్లో ఎంత తృప్తి.

అసలు శేఖర్ మొహమే ఎంతలా వెలిగిపోయింది.

పడ్డ శ్రమంతా మర్చిపోయి - తనకోసం తనవాళ్ళుగా-తను సర్వస్వం అర్పించటానికి సిద్ధంగా వున్నట్టు-వాళ్ళు తప్ప మరో లోకం లేనట్టు రెండు వైపులా పొదివి పట్టుకుని గర్వంగా లోపలికి వెడుతూ తన వంక ఆదోలా చూశాడు శేఖర్,

ఆ చూపులకి విలువ కట్టగలడా తను?

ఆ భావాల్ని చదవగల శక్తి వుందా తనకి?

గంటలు క్షణాల్లా విచిత్రంగా గడిచి పోయాయి.

ప్రతి క్షణం ఎంత విలువైందో స్పష్టంగా కన్పిస్తోంది.

ఎన్ని క్షణాలు .... క్షణాలేమిటి ఎన్ని సంవత్సరాలు ఇంత కాలం నిస్సారంగా గడచి పోయాయి.

ఎలా గడపగలిగాడు తను ?

ఇంటికి రాగానే ఉసూరు మన్పించింది.

తను అదృష్టంగా భావిస్తున్న ప్రశాంతత బరువు పేరుస్తున్నట్టుంది.

కారు గ్యారేజీలో పెట్టి - బరువుగా నిట్టూర్చాడు.

తన వెనుక తన నీడే వస్తోంది.

ముందున్న దంతా శూన్యంగా కన్పిస్తోంది.

అంతకన్నా శూన్యంగా చూస్తూ తల్లీ తండ్రీ కన్పిస్తారు.

ఎప్పటికప్పుడు తను క్షేమంగా వచ్చాడన్న సంతోషం తప్ప వాళ్ళ కళ్ళల్లో ప్రత్యేకంగా ఇంకేం కన్పిస్తుంది ?.

తన స్థితీ, హోదా, వాళ్ళలో-పూర్వపు సంతృప్తినీ, ఆనందాన్ని మిగల్చటం లేదెందుకు.?.

తానాశించే ఉత్సాహం వాళ్ళల్లో లోపిస్తోందేమిటి ?-

పూడ్చలేని వెల్తి వాళ్ళల్లో స్పష్టంగా కన్పిస్తోందెందుకని ?

ఈ వయసులో ఇంత నిశ్చింత ఎంత



మందికి దొరుకుతుంది ? .

ఈ అదృష్టం ఎంత మంది కుంటుంది ?

రామకృష్ణ ఆలోచన్లూ అంచనాలు పూర్తిగా తారుమారైనట్లు కన్పించాయి.

శేఖర్ కుటుంబంతో సన్నిహితత్వం పెరుగుతున్న కొద్దీ - తన తల్లి దండ్రుల అసంతృప్తి భూతద్దంతో చూసినట్టు మరీ కన్పిస్తోంది.

అవును. ఆ వయసులో వాళ్ళు కోరుకుంటున్న కోరికలు ప్రకృతి విరుద్ధాలేమీ కావు.

"అడుగు తీసి అడుగేస్తే నౌకర్లూ చాకర్లూ-అన్నీ బాగానే అమర్చి పెడుతున్నారు. కాదనం....- కానీ ఇల్లంతా అజమాయిషీ చేస్తూ కోడలు పిల్ల తిరుగుతుంటే........"

"పుస్తకాలు చదివి కళ్ళు పోతున్నాయిరా రాముడూ—ఈ కళ్ళల్లో వెలుగుండగానే మనుమల్ని కంట చూస్తానో లేదో....—"

"కాలాని కేముందిరా-కదలకుండా కూర్చున్నా గడుస్తుంది - గార్డినాలేసుకు పడుకున్నా గడుస్తుంది....-ఒక అర్థం పరమార్థంతో అది గడిచినప్పుడేగా—అన్నీ సాధించామన్న తృప్తి మిగలేది-"

"నిన్ను చూసి మేమెంత గర్వ పడుతున్నామో. ..—రేపు నీ కొడుకుని చూసి నువ్వు ..."

ఇప్పుడు వాళ్ళ మాటలు అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డ్స్ అన్పించటం లేదు.

ముసలి నపు చాదస్తం కన్పించటం లేదు.

జీర్ణించుకున్న అనుభవం కన్పిస్తోంది.

తన కోసం వాళ్ళుపడే ఆరాటం స్పష్టంగా కన్పిస్తోంది.

తమవల్ల పుట్టి పెద్దది కాబడ్డ మొక్క పూలూ పళ్ళతో నిండుగా కళకళలాడాలనే ఆశ పడతారు ఎవరైనా—

అది సహజం.

కానీ తన ప్రవర్తనా సహజమనే ఇన్నాళ్ళూ అనుకుంటూ వచ్చాడు.

—ప్రకృతి సహజం మటుకు కాదు.

ఇది తెల్సుకోటానికి ఇంకా ఆలస్యం కాలేదు.

"నాన్నా....నేను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాన—"

మాట మాత్రానికే ఆయనెంత సంబరపడిపోయాడు.

"అమ్మా—కోడలు కావాలన్నావు కదూ....వస్తుందిలే—"

ముందర తెల్లబోయి చూసినా—పాపం సంతోషంతో ఉక్కిరి బిక్కిరైపోయింది.

తల్లిదండ్రులకి విషయం ఇంత సంతోషాన్ని కల్గిస్తుందా?

అప్పుడెంత తృప్తిగా వుంది తనకి.

ఇంక ముందున్న జీవితమంతా ఎంత నిండుగా హుందాగా కన్పిస్తోంది—

వెంటనే తన ప్రయత్నాలు తను మొదలు పెట్టాడు రామకృష్ణ. ఒక నిర్ణయాని కొచ్చాడు.

o o o o

"శేఖర్....ఇవాళ నీ మూడ్ బావున్నట్టు లేదు. వెడదాం పద—" రామకృష్ణని పరిశీలనగా చూశాడు శేఖర్.

అతని కళ్ళల్లో తృప్తీ, నిండుదనం స్పష్టంగా కన్పిస్తున్నాయి.

తన సమాధానం కోసం ఎదురు చూస్తున్న అసహనం కూడా కన్పిస్తోంది.

"మూడ్ కేంతే" గాని — ఆలోచనంతా నీ గుంచే...."

"అంతగా ఆలోచించాల్సిన విషయమా?"

"లేదా కాస్త ముందరే పెళ్ళయుంటే ఈ పాటికి మనవడో మనవరాలో కూడా వుండి వుండేవారు. ఆలస్యంగా తీసుకున్న నిర్ణయాల్లో తొందర పడ్డామన్న భావం ఎప్పటికీ రాకూడదు. అసలు పశ్చాత్తాపం పడాల్సిన అవసరం తెచ్చుకోకూడదు....—"

శేఖర్ లో నిజాయితీ కన్పిస్తోంది. తన కోసం ఆరాటం కనిపిస్తోంది.

"అటువంటి పరిస్థితి నాకొస్తుందని ఎందు కనుకుంటున్నావురా?"

చిన్నగా అన్నాడు రామకృష్ణ.

"రాకూడదనే అనుకుంటున్నా. ఐనా ఎందుకో అనుమానం పట్టి లాగుతోంది."

రామకృష్ణ చిన్న బుచ్చుకున్నాడు.

గీత కళ్ళముందు కదిలింది.

గీత—

తనకేం అనాలోచితంగా పరిచయం కాలేదు. తను ఛార్జ్ తీసుకున్న రోజే—తన స్టెనోగా పరిచయం కాబడ్డ అందాల బొమ్మ. ఐతే ఆవిడ అందాన్ని గమనించి కుతూహలాన్ని పెంచుకునే - తీరికా, ఉద్దేశ్యం బొత్తిగా లేవు రామకృష్ణకి.

ఆవిడ చురుకుదనం, పనిలో శ్రద్ధా, అణకువా, మర్యాదా, హుందాతనం మటుకు గుర్తించగలిగాడు.

—అదీ వృత్తి పరంగానే.

గీత వ్యక్తిత్వానికి గౌరవాన్నిచ్చేవాడు.

ఆ పని మెళకువని మెచ్చుకునేవాడు.

ఆ నిరాడంబరతకి ముచ్చటపడేవాడు.

అంతే. అంతవరకే....

ఐతే వివాహం చేసుకోవాలనే ఉద్దేశ్యం కలిగాక — మొదటిసారిగా తన ఆలోచన లోకి వచ్చింది గీత.

ఐతే ఏం?—

ఆ దృష్టితో పరిశీలనగా చూసిన రామకృష్ణలో గీత పరంగా అసంతృప్తనేది ఏ కోశానా మిగల్లేదు.

"సర్!—"

ఏదో అడగాలనుకున్న రామకృష్ణ తడబడేవాడు.

"యస్...."

కడిగిన ముత్యంలా, దంతపు బొమ్మలా, ఎదుట నిలబడ్డ గీతని చూస్తూంటే మనసు మూగబోయేది.

విశాలమైన ఆ కళ్ళల్లో, నిర్మలత్వం, హుందాతనమే కాదు, విశేషమైన అందం ఆకర్షణ కూడా పోటీల మీద కన్పిస్తున్నాయి,

ఆ చిరునవ్వు పెదాలు హాయిగా నవ్వుతూ-ఆత్మీయంగా పలకరిస్తున్నట్టుంటే-

తనెప్పుడూ చూడని సౌకుమార్యాన్ని, అతి సున్నితమైన అందాన్నీ, తన ప్రక్కనే ఊహించుకుంటే—ఆ భావనే అద్భుతంగా వుంది.

ఆ ఊహే అనిర్వచనీయంగా వుంది.

తన సెలక్షన్ తప్పులేదనే ఉద్దేశ్యం-ఎంతో గమనించిన మీదట స్థిరం చేసుకున్నాడు.



అభిప్రాయం స్థిరపడ్డాక ఆలశ్యం చేయటం మంచిదన్పించలేదు. అందుకనే గీత అభిప్రాయాన్ని సూటిగా అడిగేశాడు.

గీత నిర్ఘాంత పోయింది.

కలో, నిజమో అర్థంకాలేదు.

వింటున్నదేమిటో చెవికెక్కలేదు.

కూటికి నోచుకోని పేదవాడి ముందు పంచభక్ష్యాలూ అందుబాటులో కన్పిస్తున్నట్టున్నాయి.

అదృష్టం మీదే నమ్మకాన్ని పోగొట్టుకున్న గీతకి-తనకోసం ఇంతటి అదృష్టం ఎదురు చూస్తోందన్న విషయం నమ్మశక్యం కాలేదు,

ఇంత అదృష్టమా??.

లేకపోతే ఆయన అంతస్థేమిటి? తనెవరు?

ఇన్నాళ్ళూ తను మూగగా ఆరాధిస్తున్న దైవం.

కలలలో ఇంతటి వరాన్ని ఇవ్వటం. పొందటం సంభవమా?-ఇది కల కాదే-యదార్థం. యదార్థం.-

గీత అంగీకారం వేరే చెప్పక్కర్లేదు.

అందమైన కళ్ళేచెప్పాయి. చెప్పేశాయి.

రామకృష్ణని గమనిస్తున్న శేఖర్ మౌనంగా తల దించుకున్నాడు. గీత అందమైందే-ఎంతో మర్యాదగల మనిషిలాగే కన్పిస్తుంది ఐతే

రామకృష్ణ లాంటి మంచి మనిషికి-ఆ స్థితికీ స్థాయికీ, సరైన ఇల్లాలు కాదగ్గ అర్హతలున్నాయా?

పొట్ట చేత్తో పట్టుకుని ఉద్యోగానికొచ్చిన మనిషి. పొట్టనింపు కోడానికి, ఒకస్థాయిలో బ్రతకటానికి—"ఎటువంటి పార్ట్‌టైం" జాబైనా చెయ్యగల సత్తావున్న మనిషని విన్నాడు.

"....... ఎటువంటి అంటే అర్థం??"

"అటువంటివి" కూడా అని విన్నాడు

ఆకుచాటులేని దొండపండు. చేస్తున్నది-పదిమంది మధ్యలో.

గీతే-మామూలు గీతైతే, అసలు ఆలోచించాల్సిన అవసరమే వుండేది కాదు. తనకొలీగ్స్ కాల్‌గర్ల్‌ని చేసి మాట్లాడిన

ఎన్నో సందర్భాల్లో అందరితో బాటు తనూ ఆనందించాడు.

కానీ ఇప్పుడు అదే రామకృష్ణ భార్యగా ఊహించలేక పోతున్నాడు.

"బాగా ఆలోచించుకో... -"

"ఇంకానా?-ఇంతకన్న-దేన్ని గురించి ఆలోచించలేదేమో-" రామకృష్ణ తేలిగ్గా అనేస్తుంటే-కష్టపెట్టుతున్నట్టు చూశాడు శేఖర్.

"చూడు .... ప్రేమా గీమా లేకపోయినా-మంచి సాంప్రదాయ కుటుంబం లోంచి వచ్చింది లక్ష్మి. చేసుకున్నాకే పరస్పరం ప్రేమించుకోటం అర్థం చేసుకోటం మొదలు పెట్టాం. చిలిపి తగాదాలు చాలా వచ్చేవి. రాలేదని చెప్పను. వస్తూనే వున్నాయి—ఐనా మా మధ్య చక్కని అవగాహనవుంది. చాలా లేతవయసులో పెళ్ళి కావటం వల్ల కావచ్చు. ఒకరికనుగుణంగా మరొకరం-ఒకరి కోసం మరొకరం మల్చుకోబడ్డాం... -"

"... ...."

"వింటున్నావా?-"

"ఊఁ... -"

రామకృష్ణ కుతూహలంగా చూస్తుంటే శేఖర్ ఉత్సాహాన్ని పుంజుకున్నాడు.

"....ఇప్పుడు నీ విషయం పూర్తిగా వేరంటాను. దగ్గర దగ్గిర నలభై ఏళ్ళొస్తున్నాయి....-"

"దగ్గిరదగ్గిరా....-నలభై దాటాయిలే"

తమాషాగా నవ్వాడు రామకృష్ణ.

"సరేలేవోయ్ ... -- అన్ని విషయాల్లోనూ ఇంత కరక్టయిన మనిషిని కాబట్టే ఇలా చెప్తున్నాను....ఒక రొటీన్ లైఫ్‌కి పూర్తిగా అలవాటు పడిపోయావు నువ్వు. నీలో స్థిరమైన నిర్ణయాలూ భావాలూ వేళ్ళునాటుకుపోయాయి.-అవునా కాదా?"

శేఖర్ ఇంతలా మాట్లాడ్డం విచిత్రంగానే వుంది రామకృష్ణకి.

"అతిగా వాగుతున్నానా?"

"లేదులే....ఇప్పటికైనా ఆ వాగుడు లోపలి అంతరార్థం క్లుప్తంగా చెప్పెయ్యి."

"అదే-అదే....అసలిప్పుడు చెప్పొచ్చేదేమిటంటే...-ఈ వయసులో పెళ్ళి చేసుకోబోతున్నావు కాబట్టి-చేసుకోబోయే భాగస్వామి విషయాలు పూర్తి అవగాహన అవసరమంటున్నాను. ఏ మంటే ఏదో చిన్నతనంలో చిలిపి ఆలోచనల్తో- సెక్స్‌తో కూడా ముడి వేసుకుని-దానికి ప్రేమను జోడించి ఇన్నాళ్ళు లాక్కొచ్చాం. ఇక ముందు పటిష్టం చేసుకున్నాం. నీ విషయం అలాకాదే....-సెక్స్‌కన్నా ఆత్మీయమైన తోడు అవసరం ఎంతైనా వుంది. సరదాల మాట అటుంచి బాధ్యతలతో అర్థాన్ని, కుటుంబానికో నిండుతనాన్ని నీ జీవితానికో పరిపూర్ణతని కోరుకోటం సహజం - లేదంటావా?-"

రామకృష్ణ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయాయి.

"అలా చూస్తావేం... -" తన మాటల్లో తొందరపాటు తన ముందా ?. భుజాలు తడుము కున్నాడు శేఖర్.

"లేదులే....కానీ ఇలా కూడా మాట్లాడగలవన్నమాట. ఇంత పెద్దరికం ఎప్పట్నుంచొచ్చిందిరా నీకూ ?-"

రామకృష్ణలో కనిపిస్తున్న ఆత్మీయతకి కొద్దిగా చెలించాడు శేఖర్.

అందుకే....అందుకే-రామకృష్ణకి అన్యాయం జరక్కూడదని కోరుకునేది. రామకృష్ణ కాపురం తన కాపురం లాగే నిండుగా పచ్చగా — సంతోషంగా సుఖశాంతుల్తో వుండాలి. తనకు తోడబుట్టిన వాడేవుంటే రామకృష్ణకన్నా ఎక్కువ ప్రేమించివుండే వాడు కాదు.

ఏమో! ! !- కాదు.

ఇది ముమ్మాటికీ నిజం. అందుకే మనసు కీడును శంకిస్తోంది. గీత విషయంలో రామకృష్ణ పొరబడ్డాడేమో అన్పిస్తోంది-

ముందా విషయం రూఢి చేసుకోవాలి.

తన అనుమానాలో - విన్నమాటలో నిజంగా నిజమైతే ఈ పెళ్ళి జరక్కుండా



శాయ శక్తులా ప్రతిఘటించాలి-

తన సెలక్షన్ శేఖర్‌కి నచ్చలేదని తెలుస్తూనేవుంది-

కారణం 'ఇదీ' అని చెప్పగలిగే స్థితిలో వున్నట్టులేడు.

ఏమైనా-ఎలాంటివైనా శేఖర్ అంచనాలు తప్పు. ఆ విషయం తన మనసు చెపుతోంది. తను చదివిన గీత మనసు చెపుతోంది-

సరైన అవగాహనకి శేఖర్‌కి సమయం చాలదు –

ఎంత సమయమైనా ఇవ్వాలి తను -

రామకృష్ణ లేచి నిలబడ్డాడు.

అతని నమ్మకం-తృప్తిగా పెదాలమీద మెరుస్తోంది-

ఆత్మ విశ్వాసం వెలుగులా కళ్ళలో కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

ఇది శాశ్వతమైతే ఎంత బావుండును -

ఇందుకు నేనేం చెయ్యాలి? -

ఏదైనా చేస్తాను -

రామకృష్ణ చెయ్యందుకుని - దృఢంగా అనుకున్నాడు.

బరువుగా లేచి నిలబడ్డాడు శేఖర్.

o o o

జి. ఎమ్ కి ట్రాన్స్‌ఫరైన సందర్భంలో ఇవ్వాల్సిన పార్టీ ఆరోజు కేన్సిల్ ఐంది లేకపోతే ఈరోజు ఈ సమయంలో తన కారు ఇంటివైపుకు దూసుకుపోతూ వుండాల్సింది కాదు -

ఇల్లు గుర్తుకురాగానే- శేఖర్ మనసులో మల్లెలు గుబాళించాయి. లక్ష్మి గుర్తుకు రాగానే మధురమైన భావన మనసులో, అగరు ధూపంలా వెలిగింది.

పైగా అర్ధరాత్రిలో తనొస్తాననుకుని వుంటుంది పాపం. పార్టీ లేదని తను కావాలనే ఫోన్ చేయలేదు.

ఎదురు చూడగా అందుకునే అనురాగపు అంచులు చూశాడు.

ఎదురు చూడకుండానే అనుభవించబోయే ఆనందపు లోతులు చూడాలని వుంది. టైము చూశాడు. ఏడూ పది.

ఇంకెంత? పావుగంటలో....

కారు సడన్ జెర్కిచ్చి ఆగింది.

ఎదురుగా వస్తున్న అమ్మాయి తన కారుతాకిడికి బలవంతంగా నిలద్రొక్కుకునే ప్రయత్నంలో పూర్తిగా కారుమీద వాలిపోయింది.

శేఖర్‌కి ముచ్చెమటలు పోశాయి.

హడావుడిగా కారు దిగుతూ దిక్కులు చూశాడు.

చుట్టు ప్రక్కల జనమెవ్వరూ లేరు. థాంక్ గాడ్. కొంతలో కొంతనయం.

"సోసారీ..."

ఆ అమ్మాయి బెదిరి చూసింది.

శేఖర్ నిర్ఘాంతపోయాడు.

"గీ ...మిస్... గీతా...."

రామకృష్ణతో చాలాసార్లు చూసింది శేఖర్ని. తన పనీ, ఇంటి బాధ్యతలో తప్ప మరో విషయం తెలియని గీత. ఉత్సుకతతో తను తెల్సుకున్నంత వరకూ — ఈ శేఖర్, రామకృష్ణకి ప్రాణ స్నేహితుడని తెల్సు.

పశ్చాత్తాపంతో కళ్ళు పూర్తిగా దించేసింది.

"క్షమించండి...తప్పునాదే-ఏదో ఆలోచిస్తూ....కారొస్తున్నది కూడా గమనించలేను."

అంత దగ్గరగా గీతనెప్పుడూ చూడలేదు శేఖర్.

ఆ సమయంలో ఆ చీకటిలో దంతపు బొమ్మలా మెరుస్తోంది.

తెల్లని అర్గండీ చీరెలో — ఎంతో నిరాడంబరమైన అలంకరణలోనే మతిపోగొడుతోంది గీత.

ఆ బెదురు చూపులో....

పాల మీగడలాంటి ఆ సొగసు...

మనసులో హత్తుకుపోయి - ఆత్మీయతను పొంగించే విచిత్ర భావం—

అన్నింటినీ మించిన ఆ హుందాతనం.

ఓహ్....అందుకే మనవాడు బుట్టలో పడిపోయాడు. బుట్టలో నిజంగా పడ్డాడు

శేఖర్ చూపుల్ని తట్టుకుంటూ చేతులు జోడించింది గీత

"వస్తానండీ ..."

"ఎక్కడికి?—ఎక్కడిదాకా వెళ్ళాలి?"

ఇప్పుడు తన కర్తవ్యం గుర్తుకువచ్చింది.

"హిమయత్‌నగర్ దాకా— మా ఇల్లక్కడే ..."

ఎంతో అణకువా పొద్దికా కన్పిస్తున్నాయి గీతలో.

"ఎక్కడండి డ్రాప్ చేస్తాను—"

కంటి కొసల్లోంచి చూస్తూ అడిగాడు శేఖర్.

ఇటువంటివాళ్ళు ఎదురు చూసేదే ఇటువంటి లిఫ్టులకోసం. ఒకసారి లిఫ్టిచ్చాక పరిచయాల్ని పెంచుకోటం - ఆ తరువాత దగ్గరగా రావాలని ప్రయత్నాలు చెయ్యటం తనలాంటివాళ్ళ బలహీనతల్ని కనిపెట్టి అందమైన వలలు వేయటం— ఊపిరాడక తన్నుకు ఛస్తూంటే తమలాభాల్ని తాము చూసుకోటం—లేదా-బెదిరింపులు - బ్లాక్‌మెయిల్సూ మామూలు కథే.

అందులో గీతలాంటి అమ్మాయైతే-

"వస్తానండీ—"

గీత వెళ్ళబోయింది.

"ఫర్వాలేదు డ్రాప్ చేస్తాను నేను-"

రామకృష్ణని గీత ప్రక్కన ఊహించుకునే ప్రయత్నంలో అతి కష్టం మీద అన్నాడు.

"ఎందుకండీ....రిక్షాలో వెళ్ళిపోతాను."

ఎవరో తిరిగిచూస్తూ మరీ వెడుతున్నారు.

ఎదురుగా వచ్చేవాళ్లు కళ్లు చికిలించి మరీ చూస్తున్నారు

ఇంక క్షణం ఆగటం మర్యాద కాదన్పించింది.

-ఇద్దరికీ

శేఖర్ చెయ్యి డ్రైవర్ ప్రక్క డోరు మీదుంది.

గీత తల వంచుకుని వెనుక సీట్లోకి ఎక్కక బలంగా డోరు లాగేసింది.

కొద్దిగా చిన్నబోయాడు శేఖర్.

ఇదేమిటి? గీతను గురించి తను వినటం మంచి విధంగా.....

"ఎక్కడున్నం చేస్తున్నారు?....అసలే రోజులు బాగాలేవు కదా—"

కారు మెత్తగాదూసుకు పోతుంటే చిన్నగా అన్నాడు శేఖర్.

"ఒకటి రెండు చోట్ల ట్యూషన్సున్నాయండీ, ఆఫీసవగానే....అవి పూర్తి చేసుకుని ఏకంగా ఇంటికి వెళ్ళిపోతాను-"

"ట్యూషన్సెందుకూ-మీకు మంచి జీతమే

వొస్తుందను కుంటూ-" తన లాంటి వాళ్ళకి వేల మీద వచ్చినా-హోదాని మైంటైన్ చెయ్యాలని ఎంత డబ్బు చాలదు. ఇటువంటి వాళ్ళకి-న్యాయానికి ఐదువందలు చాలొచ్చు ఎంత చెట్టుకు అంతగాలైనా.. గీతలాంటి వాళ్లు సరిపెట్టుకోవాలి రెండు చేతుల్తో-

ముందు అద్దంలోంచి గీత శీలగా కన్పిస్తోంది.

ఆ కళ్లు అమాయకంగా నిశ్చలంగా ఎటో చూస్తున్నట్లున్నాయి.

"జీతం చాలదు సార్—అనుకున్నది సాధించాలంటే....కొన్ని తప్పవు"

గీత గొంతు దృఢంగా విన్పించింది.

అనుకున్నది సాధించటమంటే—రామకృష్ణ లాంటి అమాయకులు మీద వల వేసి పట్టుకు నేదాకానా?-ఆ తరువాత సంపాదించాల్సిన అవసరమేం వుండదు. భేష్ మంచి ప్లానే—

"సర్....రైట్....రైటుకు తిప్పాలి-"

కారు రైటుకు తిరిగింది.

ఇలా కార్లలో తిరగటం అలవాటు లాగేవుంది. తను రామకృష్ణ ఫ్రండని తెల్సుకదూ-అందుకే ముందు జాగ్రత్తగా వెనకాల కూర్చుంది.

శేఖర్ కారు స్లో చేస్తున్నాడు.

ప్రొద్దుట్నుంచీ అల్సిపోయినా—అప్పుడే వికసించి మంచు బిందువులతో తడిసిన పారిజాతంలా వుంది గీత.

ఎదుటి వాళ్ళ అలుపు పోగొట్టేటంత ఫ్రెష్‌గా వుంది.

"సర్. లెఫ్ట్‌కి తిప్పాలి......—"

బాధపడుతున్నట్టూ-సిగ్గుపడుతున్నట్టూ అందిగీత.

తనలాంటి ఆఫీసర్ కార్లో కూర్చున్న గీతలాంటి అమ్మాయికి ఆ రెండూ సహజమే మరి.

ఏ నిముషాన ఎటు తిప్పాల్సొస్తుందోనని బాగా స్లో చేశాడు శేఖర్.

'గీత దంతపు బొమ్మలాంటిది-'మరోసారి అనుకున్నాడు శేఖర్. రామకృష్ణ గుర్తుకు రావటంతో లక్ష్మి గుర్తుకువచ్చింది. ఛఛ లక్ష్మితో-గీతకు పోటీ పెట్ట కూడదు...—గీత కేవలం అందాలబొమ్మ-లక్ష్మి-పవిత్రమైన దేవతా మూర్తి. గుండెనిండుగా గాలి పీల్చుకున్నాడు శేఖర్ -

'పూర్ రామకృష్ణ — పశ్చాటు కన్వేన్స హిం?-'

"సర్ ఇదే ఇల్లు -"

మళ్ళా సడెన్ జర్కతో ఆగింది కారు.

ఇంటికి దూరంగా ఎక్కడో ఆపి థాంక్సు చెప్పి తలొంచుకుని వెళ్ళిపోతోందనుకున్నాడు. కానీ-మహారాణిలా కారు దిగి చిరునవ్వుతో చేతులు జోడించింది.

"సర్-ఇంట్లోకిరండి-నాన్నగార్ని ఇన్ట్రడ్యూస్ చేస్తాను-"

"పరవాలేదు—"

"పరవాలేదుసర్ రండి—"

కాదనలేక పోయాడు.

'ఒకవేళ ఇంటికి పిల్చి...—' ఈ టెక్నిక్ కూడా విన్నట్టే గుర్తు.

అయిష్టంగానే లోపలికి అడుగు పెట్టాడు.

ఒక దేవాలయంలో అడుగు పెడుతున్న భావన విచిత్రంగా ఉక్కిరి బిక్కిరి చేసింది.

వీల్ చైర్‌లో కూర్చున్న పెద్దమనిషి కళ్ళతోనే-పలకరింపుగా—ఆత్మీయంగానవ్వి కూర్చో మన్నట్టు సోఫాచూపించాడు.

"నాన్నగారూ శేఖర్‌గారు....అంటే రామకృష్ణ గారి-........—"

గీత పరిచయం చేస్తుండగానే ఆ ఇంటి వాతావరణాన్ని కళ్ళతో చదివేశాడు శేఖర్. చక్కని అభిరుచి-స్వచ్ఛమైన నిరాడంబరత-హుందాతో కూడిన డెకరేషన్-ఒకస్టైనో ఇల్లంటే నమ్మబుద్ధి కావటంలేదు-

"క్షమించాలి నేను లేచి మర్యాదలు చెయ్యలేను. బికాజ్ అయామె పెరాలిటిక్ పేషంట్——"

ఆ గంభీరతకూ-స్వచ్ఛతకూ కొద్దిగా చలించాడు శేఖర్. అంతవరకు, ఆయన్ని గమనించనందుకు బాధపడ్డాడు.

"గీత....గారు--ఒక్కరే చూస్తోంటే-" తడబడ్డాడు శేఖర్.

ఆయన నిట్టూర్పులో బాధ ధ్వనించింది-

"నేను రిటైరయాక-ఇంటి బాధ్యతంతా గీతమీద పడింది-పైగా ఈ జబ్బొకటీ....——"

"ఏ డిపార్ట్మెంటండీ?-"

ఏ గుమాస్తానో అన్నట్టు యధాలాపంగా అన్నాడు శేఖర్

"మెడికల్-రీజినల్ డైరెక్టర్‌గా——"

శేఖర్ ఉలిక్కి పడ్డాడు.

"బాబు-కృష్ణా——"

లోపలికి వెళ్ళబోతున్న కృష్ణ శేఖర్ని చూసి సభ్యతతో నమస్కరించాడు.

"కృష్ణ-గీత తరువాత వాడు-ఈ నెలతో ఎం. ఎస్. ఐపోతుంది గీత పంతం పట్టుదల నెరవేరినట్లే ....— ఇక వాడి సంరక్షణలో నన్నుంచి ...." తృప్తిగా నవ్వుతున్న ఆయన కళ్ళల్లో నీళ్ళు స్వచ్ఛమైన ముత్యాల్లా మెరిశాయి. తను నిజాయితీతో మిగుల్చుకున్న రత్నాలను చూచి గర్వంగా వెలిగాయి.

"గీత అందర్లాంటిది కాదు బాబూ-అర చేతుల్లో పెంచినా - దాని వ్యక్తిత్వంతో మమ్మల్నే పెంచింది-రామకృష్ణగారు కోరి చేసుకుంటానన్నారని తెల్సింది-" పై పంచతో కళ్ళద్దుకుంటున్నఆయనలో సంస్కారం చూసినకొద్దీ కన్పిస్తోంది."

"సార్—కాఫీ తీసుకోండి—"

కృష్ణ చేతుల్లోంచి కప్పందుకున్నాడు-

ఆప్యాయంగా అందుకున్నాడు. ఆత్మీయంగా పెదాలకానించాడు.

కృష్ణలో గీత అందం కన్పిస్తోంది. హుందాతనం ఆ అందానికి మరింత మెరుగులు దిద్దింది. తన కూతురు ఈ ఇంటి కోడలైతే -

అలా అన్పించిందా క్షణం.

o o o

కాలింగ్ బెల్ అదేపనిగా మోగుతుంటే బద్ధకంగా తలుపు తీసింది లక్ష్మి. శేఖర్ ఇంట్లోకి అడుగు పెట్టటం రెండుగంటలు కొట్టటం ఒకేసారి జరిగాయి.

"అబ్బా ఇంత ఆలస్యంగానా రావటం? ఇంతవరకూ పార్టీయే-"

అగ్నిగోళాల్లా మండుతున్న శేఖర్ కళ్ళల్లోకి చూసుంటే-అంత పతివ్రతా భస్మమైపుండేదే. నలిగిన పట్టుచీరె, మెరుస్తున్న నగలూ—మత్తెక్కిస్తున్న మల్లెలూ చిరుచిరు అందెలూ.... లక్ష్మి ఎప్పటిలాగే వుంది....—

కానీ—!!!

"లేటని చెప్పారు గానీ మరీ ఇంత లేటా? బాబూ బేబీ, పిక్చరునుంచొచ్చి చాలాసేపు మీకోసం చూశారు-"

ఏదేదో చెప్తూనేవుంది లక్ష్మి. అమాయకంగా కళ్ళు తిప్పుతూ వెంటవెంటే కిరుగుతూనే వుంది. ఐనా ఆ కళ్ళు మూతపడుతూనేవున్నాయి.

శేఖర్ కళ్ళు మటుకు విచ్చుకుని శూన్యాన్ని కాల్చేలా చూస్తున్నాయి.

"నేను పడుకోనా?- మీరు మొహం కడిగేసుకురండి-"

బెడ్ రూమ్‌లోకి వెడుతున్న లక్ష్మిని అనుసరించటానికి కాళ్ళు ముందుకు సాగ లేదు.

గెస్ట్ రూమ్‌లోకి వెళ్ళి అలాగే భారంగా మంచం మీద పడుకున్నాడు.

కంటిసెగలు ముంజేతిని తాకుతున్నాయి.

గుండె మంటలు ఆవేశంతో ప్రజ్వరిల్లు తున్నాయి.

కళ్ళు మూసినా తెరచినా ఒకటే దృశ్యం-

దృశ్యం !!!-

శేఖర్ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

రఘూ'!!-

రఘు తన పరపతితో ఉద్యోగాన్ని సం పాదించుకోవాలని ఈ ఇంటిని ఆశ్రయించిన మనిషి. లక్ష్మికి దూరపు చుట్టం. నౌకరీ కోసం ఈ ఇంట్లో నౌకర్లా చాకిరీ చేస్తున్న వెధవ....-

లక్ష్మి ప్రోద్బలంతోనే ఈ ఇంట్లో కుక్కలా బ్రతుకుతున్న....-

శేఖర్ కణతలు విపరీతంగా అదురు తుంటే గట్టిగా నొక్కిపట్టాడు.

రఘు ఊరెళ్ళి ఇవాళే వచ్చినట్టున్నాడు. సమయం-సందర్భం-కలిసి వచ్చాయి.

చక్కగా సద్వినియోగం చేసుకున్నారు-

ఇద్దర్ని బెడ్ రూమ్‌లో-"అలా" చూసి- గిరుక్కున వెనుకకు తిరిగి వచ్చేశాడు తను. సమాజం-సమాజంలో తన స్థానం-పరువూ- దానితో ముడి పెట్టుకున్న ప్రతిష్టా తర తరాల సాంప్రదాయం-దాన్ని పట్టుకు వ్రేళ్ళాడుతున్న తన మూర్ఖత్వం, ఇన్నాళ్ళూ కళ్ళు మూసుకుపోయిన తన వివేకం-ఇప్పుడే తట్టి లేపిన కర్తవ్యం- మళ్ళీ తనని ఇంటికి వచ్చేలా చేశాయి.

ఈ నిజం కళ్ళ పడక పోతే ఎంత బావుం డేదో?

ఎవరికి బావుండేది?

నిజమనుకుంటున్న తన కల భ్రాంతని తెలియక పోతే బావుండేదా?

ఎంత భ్రాంతి!!!

హైక్లాస్ సొసైటీలో ఇటువంటివి జరుగు తాయట-జరిగాయి-జరిగింది-ఐనా తెల్ల వారగానే సాంప్రదాయమనే ముసుగు మర్యాదగా తగిలించుకోవాలట-

తగిలించుకోవాలి!!!-

కాకపోతే సమాజంలో తన స్థానం....?

పిల్లల భవిష్యత్??-

భగవాన్!'-

చటుక్కున గీత గుర్తుకు వచ్చింది-

ఒక్క కుదుపున లేచి ఫోనందు కున్నాడు. క్షణం కూడా ఆలస్యాన్ని భరించ లేనంత ఆత్రంగా నంబర్ డయల్ చేశాడు-

ఎంతో సేపటికి అవతల ఫోనందు కున్నాడు.

"హలో....రామకృష్ణా.....నువ్వేనా-"

"శేఖర్ ....ఏమైంది?-" రామకృష్ణ నిద్రమత్తులోనే గాభరాగా అరిచాడు.

"బ్రదర్-నీ సెలక్షన్ ఎక్సలెంట్, గీత నీకు తగ్గ ఇల్లాలు...."

రామకృష్ణ నవ్వు విన్పించింది.

"నవ్వకురా-ఇందాక టన్నుంచి ఆలో చించాను. రేపే వాళ్ళతో మాట్లాడు....ఈ విషయం నీతో చెప్పేదాకా........నిద్ర రాదేమోనని...."

"నీ బోంద.... అందుకంత అర్ధరాత్రి ఫోనా....—"

శేఖర్ ఫోన్ పెట్టేశాడు.

చిరుగజ్జెలు దగ్గరా తుంటే-ఆవేశంగా లేచి తలుపులు మూసి వేశాడు.

తెల్లవారితే లక్ష్మి దేవతలా దర్శన మిస్తుంది.

అప్పుడు....అప్పుడు-సమాజంలోని ఒక ప్రముఖ వ్యక్తిగా, తనేం చెయ్యాలి? -ఏమీ చెయ్యలేని నిస్సహాయత నిద్రను ఆవహిం చింది.